క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామం రజకుల కాలనీలో సీతారాముల గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్ రెడ్డి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సా ర్‌సీపీ నాయకులు ఎంపీటీసీ రమణారెడ్డి, పెద్దనాగిరెడ్డి, పీవీ సుధాకర్‌రెడ్డి, నంద్యాల శివ వర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వీరారెడ్డి, రాజారెడ్డి, నాగి రెడ్డిలు పాల్గొన్నారు.

కోరవానిపల్లెలో నేడు

తొండూరు : మండల పరిధిలోని కోరవానిపల్లె గ్రామంలో శుక్రవారం భూమిపూజ కార్య క్రమం జరగనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని శ్రీసీతారాముల దేవాలయం, శ్రీకృష్ణాలయాలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు : మండల పరిధిలోని అంబవరం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 1- 30 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాధ రెడ్డి అధికారులతో కలిసి పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తారని తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

త్వరలో పాలిసెట్ శిక్షణ

వేంపల్లె : పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల కోసం ఉచితంగా శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు వేంపల్లె ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమోహన్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి విద్యార్థులకు అనుకూలంగా స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పదవ తరగతి హాల్ టికెట్, రెండు ఫొటోలతో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9010222172 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఎలక్ట్రిషియన్ కోర్సుపై శిక్షణ

లింగాల : లింగాల ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషియన్ కోర్సుపై మూడు నెలల స్వల్పకాలిక శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామ్మూర్తి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పీఎంకేవీవై పథకం ద్వారా నిర్వహిస్తున్న ఈ కోర్సులో చేరేందుకు పదవ తరగతి పాసై, 15 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం అందించే సర్టిఫికెట్‌ను అందిస్తారన్నారు. ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

నేడు వేలం

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీకి చెందిన బస్టాండు, దినసరి కూరగాయల మార్కెట్టు, జంతువధ శాల, మార్కెట్ రూములకు సంబంధించి శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం పాట వేస్తున్నట్లు నగర కమిషనర్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దినసరి మార్కెట్, బస్టాండుకు రూ.50 వేల చొప్పున, జంతు వధశాల, మార్కెట్ రూములకు రూ.20 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెనని ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పులివెందుల టౌన్ : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని యాపిల్ మెడికల్ స్టోర్ వద్ద గురువారం మానవత సంస్థ ఆధ్వర్యంలో చల్లని వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మానవత సంస్థ ప్రతినిధులు, రిటైర్డు తహసీల్దార్ సి.వి.ప్రభాకర్‌రెడ్డి, రిటైర్డు ఏఈ ఎస్.సుబ్బారాయుడులు ప్రారంభించారు. కార్యక్రమంలో మానవత సంస్థ ప్రతినిధులు కొండారెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, శివరామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, మైసూరారెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, మెడికల్ స్టోర్ యాజమాని గంగాధర పాల్గొన్నారు.

రేపు వేంపల్లెలో జాబ్‌మేళా

వేంపల్లె : వేంపల్లె పట్టణం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌లో ఉద్యోగాల కోసం ఏప్రిల్ 1వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం బాలస్వామి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ జాబ్ మేళాకు మహిళలు మాత్రమే హాజరు కావాలని.. ఆసక్తి గల వారు పాస్‌పోర్ట్‌సైజు ఫొటో, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9000404816, 8374491240 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పిడుగులు పడి చెట్లు దగ్ధం

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని తూర్పు గండ్లూరు కాలనీలో పిడుగులు పడి టెంకాయ చెట్లు దగ్ధమయ్యాయి. గురువారం రాత్రి పెనుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అలాగే రెండు పిడుగులు కొబ్బరి చెట్లపై పడ్డాయి. దీంతో ఆ చెట్లు కాలి బూడిదయ్యాయి.

అంతా రామమయం

- భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి
- పానకం, వడ పప్పు పంపిణీ



పెద్దముడియం మండలం గుండ్లకుంటలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, పులివెందుల మండలం పెద్దరంగాపురంలో కుందేళ్ల పార్వేట

పులివెందుల టౌన్ : పులివెందుల క్లస్టర్ పరిధిలోని పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పులివెందులలోని భద్రాది రామాలయం (గీతామందిరం)లో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రీడింగ్ రూమ్ వీధిలో ఉన్న రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆంజనేయస్వామి ఆలయం, తూర్పు, పడమటి ఆంజనేయ స్వామి, కోతి సమాధి, షిర్డిసాయిబాబా ఆలయాలతోపాటు తదితర ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. నగరిగుట్ట శ్రీకోదండరామస్వామి, పడమటి ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో గోవిందరాజ టెక్స్‌టైల్స్ కంపెనీ జీఎం శివకుమార్, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కుందేళ్ల పార్వేట కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

సింహాద్రిపురం : రావులకొలను గ్రామ పంచాయతీ పరిధి మద్దెలపాయ గ్రామంలోని కోదండరామ స్వామి ఆలయంలో తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిడివెల్ల ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం కడు రమనీయంగా నిర్వహించారు.

పానక చలివేంద్రం ప్రారంభం

పులివెందుల రూరల్ : పులివెందులలోని ముద్దనూరు రోడ్డు గాంధీ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన పానక చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. చలివేంద్రంలో ఏర్పాటు చేసిన సీతారాముల చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె, అచ్చివెళ్లి, ఎర్రిపల్లె, తుమ్మలపల్లె, రాగిమానుపల్లె తదితర గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వేంపల్లె : స్థానిక వీరాంజనేయస్వామి దేవస్థానం, గాండ్ల వీధిలోని శ్రీరాముని ఆలయం, బలిజ సంఘం వీధిలోని గౌరిదేవి ఆలయం, వివేకానందరెడ్డి కాలనీలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవృషభాచలేశ్వరస్వామి భజన బృందం వారిచే వేంపల్లె పట్టణంలోని 15 రామాలయాల్లో భజనలు చేశారు. సాయంత్రం శ్రీరాముని ఉత్సవమూర్తులను గ్రామ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్, చంద్రశేఖర్, రామచంద్ర, రామ, వార్డు మెంబర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేట : చక్రాయపేటలోని శ్రీవేంకటేశ్వర, రాచరాయస్వామి ఆలయాల ఆవరణలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మన్‌లు చక్రపాణిరెడ్డి, ఓబుళరెడ్డి, హరనాథరెడ్డి, కమిటీ సభ్యులు రంగారెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆంజనేపురంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వేముల : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో పానకం, వడపప్పు భక్తులకు పంపిణీ చేశారు. భూమయ్యగారిపల్లె గ్రామంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు.

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి మంగళ వాయిద్యాలు, రామ భజనలతో గ్రామోత్సవాలను నిర్వహించారు. పార్నపల్లె గ్రామంలో అశ్వరథంపై శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.

జమ్మలమడుగు : నియోజకవర్గంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జమ్మలమడుగులోని నేతాజీనగర్‌లో సీతారాముల ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహించారు. అంబాభవానీ ఆలయం సమీపంలో ఉన్న సీతారాముల ఆలయంతోపాటు పార్కువీధి, సంజామల మోటు సమీపంలో ఉన్న సీతారాముల ఆలయంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

ముద్దనూరు : మండలంలోని రామాలయాల్లో శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ముద్దనూరులో ఉదయం కల్యాణోత్సవం, అన్నదానం, ఉత్సవ విగ్రహాలకు సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

మైలవరం (జమ్మలమడుగు రూరల్): మైలవరం మండలంలోని ధన్నవాడ గ్రామంలో ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. మైలవరం మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, సతీమణితో కలసి స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహించారు.

- దాల్మియా సిమెంటు కర్మాగారంలో 10 రోజుల నుంచి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు ధ్వజావరోహణం నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని దాల్మియా ప్లాంట్ యూనిట్ హెడ్ ముఖేష్‌కుమార్ సిన్హా సతీమణి కుంజతా, నేతాజీరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎర్రగుంట్ల : మండల, పట్టణ పరిధిలో ఉన్న శ్రీరామాలయాలలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిర్రాజుపల్లి గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ ఇన్‌చార్జీ ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కదిరివారిపల్లె, పట్టణంలోని వేంపల్లి రోడ్డులోని శ్రీ రామాలయం, కడప రోడ్డులోని క్రాంతి నగర్‌లో ఉన్న శ్రీరామాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

పెద్దముడియం : గుండ్లకుంట గ్రామంలో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపసుపుల గ్రామంలోని ఏడు రామాలయాల్లో భక్తులు స్వామి వారి వేడుకలను ఘనంగా నిర్వహించారు.


పులివెందులలో ప్రత్యేక అలంకరణలో శ్రీకోదండరామస్వామి


సీతారాముల చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి


మైలవరం మండలం ధన్నవాడలో భక్తులకు అన్నదానం

కనుల పండువగా కల్యాణం

కమలాపురం : కమలాపురంతోపాటు కె.అప్పాయపల్లె, గంగవరం, విభరాపురం, సంబటూరు, కంచ్నగారిపల్లె, కుంట, కోగటం, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, నల్లింగాయపల్లె, రాజుపాళెం, మీరాపురం తదితర గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులో వెలసిన శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం, క్రిష్ణా నగర్‌లోని సీతారామాలయం, ఎంపీడీఓ కాలనీ రామాలయం, కె. అప్పాయపల్లెలోని రామాలయం, అలాగే గంగవరం, విభరాపురం, పెద్ద చెప్పలి, కుంట, కంచన్నగారిపల్లె, కోగటం, సి.రాజుపాళెం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, సంబటూరు, మీరాపురం, మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారిని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. క్రిష్ణా నగర్‌లో నిర్వహించిన బండ లాగుడు పోటీలు రసవత్తరంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 జతల కాండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని తాటిమాకులపల్లె, సంగాలపల్లె, పాయసంపల్లె, యు వెంకటాపురం, ఉరుటూరు గ్రామాల్లో సీతారాముల కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. తాటిమాకులపల్లె రామాలయంలో నిర్వహించిన కల్యాణమహోత్సవంలో రిటైర్డ్ జడ్జి పాలెం చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులు పాలెం మల్లికార్జున్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భూజాత్‌రెడ్డి, సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. బుసిరెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దపుత్తలోని పురాతన యోగా రామాలయం, వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వున్న రామాలయం, కొప్పోలులోని ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దపుత్తలో జరిగిన కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర పరిశ్రమల సలహాదారు రాజోలు వీరారెడ్డి పాల్గొన్నారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీ, పైడికాలువ తదిత గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెండ్లిమర్రి : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమిని ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వారు రామాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని వెంకటగారిపల్లిలో సీతారాముల వారి ఆలయంలో కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొప్పర్తిలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయ ఆవరణంలో నిర్వహించిన సీనియర్ ఎద్దుల బండలాగుడు పోటీలను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.6,016, ఏడు, ఎనిమిదవ బహుమతి రూ.5 వేలను అందించారు. మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



కమలాపురంలో సీతారాముల కల్యాణం వీక్షిస్తున్న భక్తులు, వీరపునాయునిపల్లె మండలం తాటిమాకులపల్లెలో కల్యాణోత్సవంలో సీతారాములు

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

పులివెందుల టౌన్ : శ్రీరామనవమి సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం దేశవు ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. స్థానిక సబ్‌రిజిస్టర్ కార్యాలయ సమీపంలోని మైదానంలో గురువారం బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, సంఘ నాయకులు కడియాల లక్ష్మినారాయణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప పాల్గొన్నారు. పోటీల్లో 10 జతల కాడెద్దులు పాల్గొన్నాయి. వేంపల్లెకు చెందిన పసుపులేటి రమణ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేల నగదు బహుమతి అందుకున్నాయి. అనంతపురం జిల్లా ఆత్మకూరు గాండ్ల రవిచంద్ర ఎద్దులు రెండవ స్థానంలో రూ.25 వేలు, పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెకు చెందిన చిన్నపుల్లారెడ్డి మూడవ స్థానంలో రూ.20 వేలు, వేముల మండలం పెర్నపాడు గ్రామానికి చెందిన దేవగాని రామాంజనేయులు, ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన పోలన్న, అనంతపురం జిల్లా ముదిగుబ్బకు చెందిన కోట్ల రమణ నాల్గవ, ఐదవ, ఆరవ స్థానాల్లో నిలిచి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను గెలుచుకున్నారు. మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతి కింద రూ.3 వేల చొప్పున అందజేశారు. బహుమతులను అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, మాజీ ఆలయ చైర్మన్ యార్వ వెంకటసుబ్బయ్య, బలిజ సంఘ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం మాజీ అధ్యక్షులు సోపాలవీరా, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, బలిజ సంఘం నాయకులు ఆంజనేయులు, తోటం శెట్టి హరి, కొంగనపల్లె మురళీ, కొండ్రాప్, వీరశైవ గురు జంగమ లింగాయతి సంఘ నాయకులు అంగడి నాగేంద్ర, వీరభద్రయ్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


చెన్నూరు మండలం కనపర్తిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : చెన్నూరు టౌన్‌తోపాటు మండలంలోని కనపర్తి, కొండపేట, ఓబులంపల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆయన కనపర్తి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీలకు జిల్లా నలుమూలల నుంచి పది జతల ఎద్దు రావడం జరిగింది. ఈ పోటీలను తిలకించేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో పల్లె కృష్ణారెడ్డి, ఎంపీటీసీ రఘురామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం చెన్నూరులోని శ్రీ సీతారామ నామ సంకీర్తన క్షేత్రంలో పాల్గొన్న ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అలాగే అరుంధతినగర్‌లో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ సీతారామ ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓబులంపల్లె గ్రామంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ జీఎస్ భాస్కర్ రెడ్డి, దుంప నాగిరెడ్డి, సర్పంచులు సిద్దిగారి వెంకటసుబ్బయ్య, తుంగ చంద్రశేఖర యాదవ్, మిట్ట కేశవరెడ్డి, టీఎస్ చంద్రారెడ్డి, పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో బోటింగ్ సామగ్రి ప్రారంభం

పులివెందుల టౌన్ : సంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం బోటింగ్ సామగ్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొత్తగా వచ్చిన టూ సీటర్ పెడల్ స్వాన్ బోట్, సింగిల్ సీటర్ వాటర్ సైకిల్‌లకు పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఏపీ సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్‌తో శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి పానకం, వడపప్పు ప్రసాదాలను పంచిపెట్టారు. అలాగే సాయంత్రం 6గంటల నుంచి హైకోర్టు న్యాయవాది రవీంద్రనాథ్‌శర్మ సౌజన్యంతో కడప ఎస్ఎస్ఎల్ డ్యాన్స్ స్టూడియోస్ మాస్టర్ సింహా తమ శిష్యబృందంతో కలసి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. పండుగ వాతావరణం కావడంతో శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది.


బోటింగ్ సామగ్రిని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి రండి

పులివెందుల రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాల మహిళల ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నట్లు సీఈఓ గంగులయ్య తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా మహిళల ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి రావాలని పిలిచారు. శుక్రవారం పట్టణంలోని విజయ్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరా పథక కార్యక్రమానికి మహిళలందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారి నాయుడు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు : డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి స్థానిక ఎస్వీ గిరి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పాఠశాల అభివృద్ధికి వితరణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీసరస్వతి విద్యా మందిరం పాఠశాలలో ప్రధానాచార్యులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం 50వ శ్రీసరస్వతి విద్యా పీఠం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా శ్రీసరస్వతి శిశు మందిర పాఠశాలలు 26 వేలు, 1.50 లక్షల మంది టీచర్లు, 32 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి పాఠశాల పోషకులు, రాంకో ఇండస్ట్రీస్ కంపెనీ జీఎం నాగరాజు, కుమారుడు భరత్‌కుమార్ తోపాటు కుటుంబ సభ్యులు లక్ష రూపాయల నగదును పాఠశాల సమితి అధ్యక్షుడు రామచంద్రారెడ్డికి విరాళంగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల సమితి సభ్యులు, ప్రబంధ కారిణి సభ్యులు పాల్గొన్నారు.



నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి వైద్య సేవలు అందించనున్నారు. చెవిలో చీము కారుట, చెవి నొప్పి, కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపి, కోలనోస్కోపి పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు మింగితే తీయడం జరుగుతుంది. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.